నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | జనవరి 19, 2025 | www.navatelangana.com

బండరాయితో బాది బాలుడి దారుణ హత్య

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన రిషి(12)ని గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో బాది హత్య చేశారు. బాలుడు కల్లు బట్టిలో పనిచేస్తుంటాడు. గ్రామ శివారులోని చింతల చెరువు సమీపంలో రిషి మర్మంగాలపై బండరాయితో దాడి చేసి హత్య చేశారు. శనివారం బహిర్భూమికి వెళ్లిన గ్రామస్థులు బాలుడి మృతదేహన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ జానకి షర్మిల పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దుండగులను త్వరలోనే పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో దుండగులను పట్టుకునేందుకు దర్యాప్తు చేపట్టామని ఎస్పీ వివరించారు.

బ్యాంక్ అధికారుల వేధింపులకు రైతు బలి

• బ్యాంక్ ఎదుట కుటుంబీకుల రాస్తారోకో



ఆదిలాబాద్‌టౌన్ : బ్యాంకు అధికారుల వేధింపులతో రైతు ప్రాణం తీసుకున్నాడు. బ్యాంక్‌లోనే పురుగులమందు తాగి అంతలోనే విగత జీవిగా మారాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఈ విషాద ఘటన కలకలం రేపింది. వాయిదా చెల్లింపులో జరిగిన జాప్యానికి బ్యాంకు అధికారులు వేధింపులకు గురి చేశారనే ఆవేదనతో బ్యాంకులోనే అధికారుల ఎదుటే పురుగులమందు తాగి కుప్పకూలాడు. బేల మండలం రేణిగూడ గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావ్(60) పట్టణంలోని టీచర్స్ కాలనీలోని ఐసీఐసీఐ బ్యాంకు నుంచి తన భూమిని మార్టిగేజ్ చేయించి, నాలుగేండ్ల కింద మూడున్నర లక్షల రుణాన్ని తీసుకున్నాడు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తున్నాడు. ఇటీవల వాయిదాగా చెల్లించాల్సిన రూ.25వేలు అనివార్య కారణాలతో సకాలంలో చెల్లించలేకపోయాడు.

పూర్తి వివరాలు మెయిన్ పేజీలో..

అర్హులమే..మాకెందుకు రాలేదు..!

• జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల జారీపై గందరగోళం • జాబితాలో పేర్లు లేకపోవడంతో పలువురి ఆందోళన
• గ్రామాల్లో చర్చనీయాంశంగా కార్డుల మంజూరు ప్రక్రియ • అనేక మంది అర్హుల పేర్లు రాలేదని ఆవేదన

ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జాబితా ప్రకటించిన ప్రభుత్వం వీటిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. కానీ ఈ జాబితాలో అనేక మంది అర్హుల పేర్లు రాలేదనే ఆందోళనలు అధికమయ్యాయి. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో పేర్లు లేకపోవడంతో తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. అన్ని విధాలా కార్డులు పొందేందుకు అర్హతలు ఉన్నప్పటికీ మాకు కార్డుల మంజూరులో పరిగణనలోకి తీసుకోలేదని పలువురు లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సమస్య అనేక గ్రామాల్లో ఉత్పన్నమవుతున్నప్పటికీ.. అధికార యంత్రాంగం నుంచి ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది. దీంతో కార్డుల మంజూరులో అధికారులు వేటిని పరిగణనలోకి తీసుకున్నారో తెలియక లబ్దిదారులు, ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. మీసేవలో..ఇటీవల ప్రజాపాలనలోనూ దరఖాస్తులు అందించినప్పటికీ ప్రభుత్వం వెల్లడించిన తాజా జాబితాలో పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కెరమెరి మండల కేంద్రంలోని ఓ వార్డులో 30మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేశారు. అన్ని విధాలా అర్హులు కావడంతో కార్డులు వస్తాయని ఆశతో ఉన్నారు. కానీ ప్రస్తుతం ఈ వార్డులో కేవలం ఆరుగురికి మాత్రమే కార్డులు మంజూరు కావడంతో రాని వారు నిరాశకు గురవుతున్నారు. ఈ పరిస్థితి ఉమ్మడి జిల్లాలో అనేక గ్రామాల్లో కనిపిస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, కెరమెరి

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా రేషన్‌కార్డులను కూడా అందజేయాలని నిర్ణయించింది. గత పదేండ్లకు పైగా కొత్త కార్డులను ప్రభుత్వం అందించకపోవడంతో వేలాది మంది వీటి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఏడాది కిందట నిర్వహించిన ప్రజాపాలనలోనూ రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు తీసుకోలేదు. అయినప్పటికీ అనేక మంది జనం తెల్ల కాగితాలపై దరఖాస్తులు అందించారు. మరోపక్క చాలా మంది ఏండ్ల క్రితం నుంచి మీసేవ కేంద్రాల్లోనూ దరఖాస్తులు చేసుకున్నారు. కానీ అప్పటి ప్రభుత్వం కార్డుల మంజూరులో నిర్లక్ష్యం వహించడం కారణంగా ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతూ వచ్చింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయాలని భావించింది. ఈ నెల 26వ తేదీ నుంచి కార్డులను పంపిణీ చేస్తామని ప్రకటించింది. ఇటీవల జరిగిన కుల గణన సర్వేలో రేషన్‌కార్డులు లేవని చెప్పిన లబ్దిదారులను పరిగణనలోకి తీసుకొని వీటిని మంజూరుచేసినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. కానీ ఇదే సర్వేలో మిగితా అనేక మంది కార్డులు లేవని చెప్పినప్పటికీ అందరినీ కాకుండా కేవలం కొందరిని మాత్రమే కార్డుల మంజూరు జాబితాలో చోటు కల్పించడంతో చోటు దక్కని వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో ఈ సమస్య కనిపిస్తోందని పలువురు సర్వే అధికారులు కూడా చెబుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

జాబితాలో పేర్లు లేక నిరాశ..!

ప్రభుత్వం ఈ నెల 26న పంపిణీ చేయాల్సిన రేషన్‌కార్డుల జాబితాను గ్రామాల వారీగా లబ్దిదారుల పేర్లతో రూపొందించి విడుదల చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో 18,741మందికి, మంచిర్యాల జిల్లాలో 18,788, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 17,044, నిర్మల్ జిల్లాలో 17,491మందికి మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ కార్డులు సరియైనవేనా...కాదా అని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.దీంతో గ్రామస్తుల్లో ఒక్కసారిగా ఈ జాబితాపై ఆసక్తి పెరిగి పేర్లు చూసుకున్నారు. దీంతో అనేక మంది పేర్లు సదరు జాబితాలో లేకపోవడం..గ్రామంలోని కొందరి పేర్లు మాత్రమే ఉండటంతో మిగితా వారు ఆందోళన చెందుతున్నారు. మాకు రాలేదంటే..మాకు రాలేదనే సమస్య తీవ్రంగా మారింది. ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే సమస్యపై ప్రధానంగా చర్చ జరుగుతోంది. కొన్ని గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదులు అందించేందుకు సిద్ధమవుతున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారులు మాత్రం ఇటీవల నిర్వహించిన కుల గణన సర్వే ఆధారంగా ఈ కార్డుదారులను ఎంపిక చేశారని చెబుతున్నారు. కానీ ఇందులోనూ చాలా మంది తమకు కార్డులు సర్వే సందర్భంగా చెప్పినప్పటికీ వీరికి మాత్రం తిరస్కరించడం వెనుక కారణాలు ఏమై ఉంటాయో కూడా స్పష్టత లేని పరిస్థితి కనిపిస్తోంది. ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి స్పష్టతనివ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జాబితాలో పేరు రాలేదు : పోర్ల సౌమ్య, కెరమెరి



మా వివాహం జరిగి ఏడేండ్లు అవుతోంది. ఇది వరకు రేషన్‌కార్డు కోసం రెండు సార్లు దరఖాస్తు చేశాం. కానీ మంజూరు కాలేదు. నా భర్త వికలాంగుడు. ఏ పని చేయలేని పరిస్థితి. అసలే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో కుటుంబ పోషణ భారంగా మారింది. రేషన్‌కార్డు అయినా ప్రభుత్వం మంజూరు చేస్తే నిత్యావసర సరుకుల కొనుగోలు భారం తప్పుతుంది. ప్రస్తుత జాబితాలో పేరు లేకపోవడంతో నిరాశకు గురవుతున్నాను.

రోజు కూలి పని చేస్తేనే పూట గడుస్తుంది : లక్ష్మీ గైక్వాడ్, కెరమెరి



మాకు ఎలాంటి వ్యవసాయ భూమి లేదు. నాకు ఇద్దరు పిల్లలు. భర్త రోజు వారి కూలి పని చేస్తున్నాడు. కూలి పని చేస్తే గాని పూట గడవని పరిస్థితి. ఆరేళ్లగా రేషన్ సరుకులు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రేషన్ కార్డు ప్రభుత్వం మంజూరు చేస్తే రేషన్ సరుకుల కొనుగోలు భారం తగ్గుతుంది. ప్రభుత్వం స్పందించి మొదటి జాబితాలోనే కార్డులు మంజూరు చేయాలి.

సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేయాలి

• ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేయాలని, సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్ సమీపంలో రైతు భరోసా పథకంపై నిర్వహిస్తున్న వ్యవసాయ భూముల సర్వేను, జనకాపూర్‌లో రేషన్ కార్డుల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి యోగ్యమయ్యే భూములను మాత్రమే రైతు భరోసా పథకానికి వర్తింపజేయాలని సూచించారు. నాలా, ఇండ్లు, వెంచర్లు, ప్లాట్లుగా మార్చిన భూములను జాబితాలో తీసుకోవద్దన్నారు. అనర్హులకు ఎట్టి పరిస్థితిలో ప్రభుత్వ పథకాలను వర్తింప చేయొద్దని నిష్పక్షపాతంగా సర్వే చేయాలని ఆదేశించారు. పట్టణంలో పలుచోట్ల కూరగాయల అమ్మకాలు జరపడం వల్ల జూబ్లీ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం కష్టతరంగా ఉందని వ్యాపారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం జనకాపూర్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, వ్యవసాయ శాఖ అధికారి మిలింద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇవ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇవ్వాలని, రైతు ఆత్మీయ భరోసా పథకానికి ఉపాధి హామీని లింక్ చేయకూడదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ కూలీల సంఖ్యను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సరికావని అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఆత్మీయ భరోసా పథకం రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ కూలీలందరికీ వర్తింపజేయాలని తెలిపారు. వ్యవసాయంలో వ్యవసాయ కూలీల పాత్ర ఎంతో కీలకమని, కూలీలు లేకుంటే వ్యవసాయం సాగు కాదని పేర్కొన్నారు. పథకంలో వ్యవసాయ కూలీలకు ప్రాధాన్యత ఇచ్చి వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు స్వామి, నాయకులు ఆశన్న, పొచ్చక్క, మోహన్ పాల్గొన్నారు.

గోదావరిలో అక్రమ తవ్వకాలు ఆపాలి

• మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్ర సమీపంలోని గోదావరి నదిలో జరుగుతున్న అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట పడేలా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం పట్టణ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి గోదావరి నదిని సందర్శించారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రోద్బలంతో గోదావరి నది నుండి అక్రమంగా ఇసుక, మట్టి తరలింపు జరుగుతోందని ఆరోపించారు. వందలాది లారీలలో అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని మండి పడ్డారు. గోదావరిలో తవ్వకాలతో బొందల గడ్డగా మారుతోందన్నారు. వర్షాకాలంలో నీరు చేరి స్నానాలకు వచ్చే భక్తులకు ప్రాణాపాయం పొంచి ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా గోదావరిలో జరుగుతున్న అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలపై అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు విజిత్ కుమార్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు

• సీపీఐ(ఎం) రాష్ట నాయకులు బండారు రవికుమార్ • రాష్ట మహాసభల వాల్ పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా సమస్యలపై నిరంతర సమరశీల పోరాటాలే తమ లక్ష్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ అన్నారు. ఈ నెల 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో జరిగే పార్టీ రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్లను జిల్లా నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో కూడా అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడుతున్నామని తెలిపారు. జిల్లాలో పోడు రైతుల పక్షాన పోరాడి తమ పార్టీ పట్టాలు ఇప్పించిందని, పులి పేరుతో తునికాకు సేకరణ చేయడానికి అటవీశాఖ నిరాకరించడంతో తమ పోరాటం ఫలితంగా అనుమతి వచ్చిందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఇతర సిబ్బందిని నియమించాలని, దానికి అనుసంధానంగా ఉన్న జిల్లా కేంద్ర ఆసుపత్రిలో డాక్టర్లు, సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులలో ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాగజ్‌నగర్‌కు క్రాస్ రోడ్డు నుండి పెద్ద వాగు వరకు ఉన్న రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో పోరాడి నిర్మాణ పనులు ప్రారంభించేలా కృషి చేశామన్నారు. జిల్లాలో గిరిజన గ్రామాలకు రోడ్లు మంజూరు చేయాలని పోరాడామని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలను గత ప్రభుత్వాల కంటే వేగంగా అమలు చేస్తోందని తెలిపారు.

మోడీ ప్రభుత్వ హయాంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైందని, ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసే దిశగా నిర్వహిస్తున్న మహాసభలకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్, బీవీ రాఘవులు, రాష్ట కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారని, జిల్లాలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, రాజేందర్, టికనంద్, మాలశ్రీ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో డీట్ యాప్ ఎంతగానో ఉపయోగం

• నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

నిరుద్యోగులకు ప్రయివేట్ రంగంలో ఉద్యోగ కల్పనలో డీట్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ జిల్లా కమిటీ సభ్యులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. నిరుద్యోగ యువకులకు ఉద్యోగ కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన డీట్ యాప్‌లో కళాశాలల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకునే విధంగా అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు. అధికారులు ఈ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. డైట్ యాప్‌లో తమ విద్యార్హతలతో పేరును నమోదు చేసుకోవడం ద్వారా వివిధ ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు వారికి అవసరమయ్యే ఉద్యోగులను నియమించుకుంటుందని తెలిపారు. నిరక్షరాస్యులు కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఈ యాప్‌లో తమ పేరును నమోదు చేసుకోవచ్చన్నారు. నిరుద్యోగులు ఇచ్చిన సమాచారం క్రోడీకరించుకొని యాప్‌లో ఆన్లైన్ రెస్యూమ్‌ను పొందుపరుస్తుందని తెలిపారు. ఆ సమాచారం ఆధారంగా కంపెనీలు నిరుద్యోగుల్ని సంప్రదిస్తాయని తెలిపారు. ఇందులో తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా నైపుణ్యానికి తగ్గ వేతనం లభిస్తుందన్నారు. పలు కంపెనీలో ఖాళీలను డీట్ యాప్‌లో పొందుపరుస్తాయని తెలిపారు. డీట్ యాప్ నిరుద్యోగులకు కంపెనీలకు మధ్య వారధిలా పని చేస్తుందన్నారు. ఇప్పటివరకు జిల్లాకు చెందిన ప్రజలు అనధికారిక ఏజెంట్ల ద్వారా ఇతర దేశాలకు ఉపాధి కోసం వెళ్లినట్లయితే వారి వివరాలను వారి కుటుంబ సభ్యులు కలెక్టరేట్ సముదాయంలోని కార్మిక శాఖ కార్యాలయంలో వారి ఆధార్ కార్డుతో 26 తేదీ లోపు సంప్రదించి వివరాలు నమోదు చేయించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9866072044 నెంబరును సంప్రదించవచ్చని తెలిపారు. సమావేశంలో పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, సిపిఓ జీవరత్నం, మెప్మా పీడీ సుభాష్, జిల్లా కార్మిక అధికారి ముత్యంరెడ్డి, డివైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ప్రాణాలు కాపాడిన బ్లూ కోట్ సిబ్బంది

• బాసర పోలీసులకు ప్రశంసలు

ముథోల్ : గోదావరి నది వద్దకు ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన ఎందరినో గుర్తించి వారి ప్రాణాలను కాపాడటంతో బ్లూ కోట్ సిబ్బంది పోలీస్ ఉన్నతాదికారులతో పాటు ప్రజలు, భక్తుల నుండి ప్రశంసలు అందుకుంటున్నారు. ఎస్పీ జానకిషర్మిల ఆదేశాల మేరకు ఆత్మహత్యల నివారణకు బాసర గోదావరి బ్రిడ్జిపై 24/7 పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. తాజాగా శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ సంతోష్ కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది తన ఆటోలోనే బాసర బ్రిడ్జికి చేరుకున్నాడు. స్నాన ఘట్టాల వద్ద ఆటోలో కూర్చుని సూసైడ్ నోట్ రాసుకుంటుండగా బ్లూ కోట్ పోలీసులు ప్రమోద్, గగన్ సూసైడ్ నోట్‌ను స్వాధీన పరుచుకొని, ఎస్సై గణేష్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు బాధితుడికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సంతోష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిండు ప్రాణాన్ని కాపాడిన ఎస్సై



గణేష్‌తో పాటు బ్లూ కోట్ పోలీసులు ప్రమోద్, గగన్‌ను ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్, ముథోల్ సిఐ మల్లేష్ అభినందించారు.

ఐరన్ ర్యాంప్‌లో కాలు ఇరుక్కొని మహిళకు ఇబ్బందులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద శనివారం బంగల్‌పేట్‌కి చెందిన జ్యోతిక వైద్య పరీక్షల నిమిత్తం కాలినడకన ఆస్పత్రికి వచ్చింది. ప్రధాన గేటు మధ్యలో ఉన్న ఐరన్ గ్రిల్ ర్యాంప్ మధ్య భాగంలో ఆమె కాలు ప్రమాదవశాత్తు ఇరుక్కుపోయి, సుమారు 15 నిమిషాల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. గమనించిన స్థానికులు, ఆస్పత్రి సిబ్బంది ఇనుప గ్రిల్స్ ను తొలగించి కాలు బయటకు తీశారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి వైద్యులు ఇంటికి పంపించారు.



బాధిత కుటుంబానికి రూ.2లక్షల ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 2004 ఏఆర్ బ్యాచ్‌కి చెందిన అక్తర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌లో స్థిరపడ్డాడు. రెండు సంవత్సరాల కింద 317 జీఓ కారణంగా ఆసిఫాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తు, జనవరి 2న అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబానికి ఆర్థిక చేయుత ఇవ్వడానికి ఉమ్మడి జిల్లాకు చెందిన 2004 సివిల్ అండ్ ఏఆర్ బ్యాచ్ ఆర్థికంగా ముందుకు వచ్చి, బాధిత కుటుంబానికి రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. అందులో భార్య పిల్లలకు రూ.లక్షా 50వేలు, అలాగే అక్తర్ వాళ్ల తల్లిదండ్రులకు రూ.50వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి 2004 బ్యాచ్ తరపున, ఆర్ఐడి వెంకట్, కిషోర్, ప్రవీణ్, అజయ్, రాందాస్, ప్రకాష్, విజయ్, రాజేశ్వర్, ధనరాజ్, సతీష్, కైలాస్ 2004 బ్యాచ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సభ్యులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని జోహార్‌పూర్ గ్రామానికి చెందిన బొంబాయి రాజు(35) ఇటీవల అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య పాల్పడ్డాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు కాగా, నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన దిగాంబర్ తన వంతు సాయంగా రూ.2వేలతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. రాబోవు రోజుల్లో ఆ కుటుంబానికి తనవంతుగా సాయం చేయడానికి ఎల్లపుడూ అండగా ఉంటానని, బాధిత కుటుంబానికి భరోస ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పోతన్న, యోగేష్, సాయికుమార్, సాయి పాల్గొన్నారు.

నవోదయ పరీక్షా కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మండలంలోని కొండాపూర్ సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షను శనివారం డీఈఓ రామారావు తనిఖీ చేశారు. జవహర్ నవోదయ విద్యాలయాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే, నవోదయ పరీక్షకు జిల్లాలో నిర్మల్‌లో-3, భైంసాలో-3 కేంద్రాలు కేటాయించామని, ఈ 6 కేంద్రాలలో 1479 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, మొత్తం 1310 మంది పరీక్షకు హాజరయ్యారని, 169 మంది గైరాజరయ్యారని తెలిపారు. పరీక్ష అనంతరం, పరీక్షలో విద్యార్థుల విజయాన్ని కోరుతూ, వారితో ఫోటోలు కూడా దిగారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ముఖ్య పర్యవేక్షకులు, శాఖాధికారులు, జిల్లా పరీక్షల బోర్డు సహాయ కార్యదర్శి భానుమూర్తి, ఇన్విజిలేటర్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎంటీయూహెచ్ బీటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ మోడల్ స్కూల్‌లో పీరియడ్‌ల వారీగా విధులు నిర్వర్తిస్తున్న హెచ్‌బీటీ అతిథి ఉపాధ్యాయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ రాజేంద్రప్రసాద్, సభ్యులుగా సందీప్, స్వరూప రెండు రోజుల కింద ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పాఠశాల ప్రిన్సిపల్ ప్రశాంత్ ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి వారిని శాలువాతో సన్మానించారు. అతిథి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

నిర్మల్ పట్టణంలో ఎన్టీఆర్ వర్ధంతి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఖ్యాతిని దశ దిశల చాటిన గొప్ప ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నతమైన వ్యక్తి దివంగత నందమూరి తారక రామారావు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు అల్లూరి రాజారెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ 29వ వర్ధంతిని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లో మహానాయకుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ తెలుగు జాతికి అందించిన సేవలను కీర్తించారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, గంగారెడ్డి, కాడే రాములు, ఆకుల రాము, సతీష్, దేవిదాస్, శ్రీనివాస్ రెడ్డి, గంగమ్మ, అంబుబాయి పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో జిల్లా కలెక్టర్ రాజర్షిషా శనివారం ఆయన కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలంటే వచ్చే నెలన్నర రోజులు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధవహించి, చదువు పైనే దృష్టి సారించేలా చూడాలని అన్నారు. ఉదయం 5 గంటలకు నిద్ర లేపి చదువుకోవాలని చెప్పాలని, పరీక్షలు అయ్యేంతవరకు వేరే పని చెప్పకూడదని, ఇంట్లో పనులు, వేరే ఇతర పనులు చెప్పకుండా కేవలం చదువు పైనే దృష్టి కేంద్రీకరించేలా చూడాలని, సూచించారు. అలాగే టీవీ, మొబైల్ చూడనివ్వకూడదని తెలిపారు. విద్యార్థులు ఇంట్లో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని, దీనివల్ల ప్రశాంతంగా చదువుకొని పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి బాసర ఐఐటీలో సీట్లు సాధించవచ్చని, భవిష్యత్తులో మంచి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. అందుకు తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ మీ పాప, బాబు ఎలా చదువుతున్నారు..? బాగా చదువుతారా..? ఇంట్లో ఎలా ఉంటారు..? తదితర విషయాలు కలెక్టర్ అడిగి తెలుసుకొని విద్యార్థులు బాగా చదివేందుకు మీ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. పదో తరగతి విద్యార్థుల వివరాలు, సిలబస్ వివరాలు, వేకప్ కాల్స్‌కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా తాను ఉదయం 5 గంటలకు లేచి 7 గంటల వరకు చదివి పాఠశాలకు వెళ్లేదని క్రమబద్ధంగా పాఠ్యాంశాలను నేర్చుకొని ఈ రోజు మీ ముందు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నానని, దీనికి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతగానో కలెక్టర్ ఉందన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివించాలని పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పనితీరును కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, డీసీబీ సెక్రటరీ గజేందర్, ఆరోగ్య పాఠశాల అనుసంధాన కర్త అజయ్, విద్యార్థులు, తల్లిందండ్రులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పట్టణంలోని రణదివెనగర్ కాలనీలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన వెంకటేశ్ ఇంట్లో మధ్యాహ్నం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. రేకుల షెడ్డులోని విద్యుత్ మీటర్ల వద్ద తలెత్తిన మంటలు ఇంటిమొత్తం వ్యాపించాయి. ఇంట్లో ఉన్న కుటుంబీకులు కేకలు వేస్తు బయటకు పరుగులు తీశారు. దీంతో చుట్టు పక్కల వారు పోగై విద్యుత్తు సరఫరాను నిలిపివేయించారు. పక్కనే ఉన్న మునీర్ అనే వ్యక్తి ఇంటికి సైతం మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు ఘటన స్థలానికి చేరకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే వెంకటేశ్ ఇల్లు కాలిపోయింది. దట్టమైన పొగలు వ్యాపించడంతో కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు, నిత్యావసరాలు, దుస్తులు, ఇతర సామాగ్రి కాలి బూడిదైందని, పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

స్వయం సహాయక సంఘాలు అభివృద్ధిలో ముందుండాలని మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇంద్రానగర్, మార్కెట్ ఏరియాలో మహిళల ద్వారా నిత్యావసరాల డిటర్జెంట్, ఫ్లోర్‌క్లీనర్, టాయిలెట్ క్లీనర్ వస్తువుల తయారు కేంద్రాన్ని సంఘ మహిళలతో కలిసి నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. అలాగే మెప్మా పీడీ సుభాష్ మాట్లాడుతూ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యాపారవేత్తలుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈద్గాం కౌన్సిలర్ రమ్య విజయ్, మాజీ కౌన్సిలర్ అయ్యన్నగారి శ్రీనివాస్, మెప్మా సిబ్బంది, మెప్మా ఆర్‌పీ మమత, హాపిజా ఆధ్వర్యంలో ఈ దుకాణం నిర్వహించబడుతుందని అన్నారు. ఈడీఐఐ మాస్టర్ ట్రైనర్ రవి, అలేఖ్య, దేవేందర్, మహిళలు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్‌లో ఘనంగా స్మృతి దివస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమాజంలో చెడు విస్తరించడానికి, ప్రజలకు మంచి మార్గాన్ని సూచించే వారు లేకపోవడమే ప్రధాన కారణమని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. పట్టణంలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ప్రజాపిత బ్రహ్మ బాబా అవివక్త దినాన్ని పురస్కరించుకొని శనివారం స్మృతి దివస్‌ను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి జోగు రామన్న బ్రహ్మకుమారీలతో కలిసి ముందుగా బాబా చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి పుష్పాంజలి ఘటించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ మానవ జన్మ భగవత్ ప్రసాదితమని, ఈ అవకాశాన్ని ఎలా వినియోగించుకోవడమనే విజ్ఞతను తెలివిని అందించడం ద్వారా మనకే వదిలేశాడన్నారు. గొప్ప ఆలోచనలతో మంచి మార్గంలో నడవడానికి ప్రేరణ అందించాల్సిన అవసరముందన్నారు. ఇలా మనిషిని సన్మార్గాల దిశగా నడిపించి, గొప్ప వ్యక్తిత్వం గల వారీగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం చిత్తశుద్ధితో కొనసాగిస్తోందన్నారు. సెల్ ఫోన్ ఒక రోజు పనిచేయాలంటే కనీసం రెండు గంటల పాటు చార్జింగ్ పెట్టాల్సి ఉంటుందని, అలాంటిది వందేండ్ల జీవితానికి మానసిక స్థైర్యం, ధైర్యం అందించే బాధ్యత మనపైనే ఉందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి రాజయోగిని రేవతి బహెన్‌జీ, బ్రహ్మకుమారీలు సరళ బహెన్, పుష్ప బహెన్, దీప్తి బహెన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నిర్మల్

రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామానికి చెందిన మొహమ్మద్ హఫీజ్ భార్య తాహెర బేగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు రత్నాపూర్ కాండ్లిలోని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమకు అండగా ఉంటానని భరోసానిచ్చారు. అలాగే నిర్మల్ రూరల్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన తొడిశెట్టి పోశెట్టి ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. కాంగ్రెస్ నాయకులు పోశెట్టి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మెన్ భీమ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ నరేష్‌రెడ్డి, పర్స నరేష్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలదే భవిష్యత్తు

నవతెలంగాణ-ఉట్నూర్

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి రైతు ఉత్పత్తి సంఘాలు దోహదపడతాయని భవిష్యత్తులో రైతుల స్థితిగతులను తీర్చిదిద్దటంలో రైతు ఉత్పత్తి సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా పేర్కొన్నారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో ట్రైకార్ మొదటి దశ చెక్కులను ప్రాజెక్టు అధికారిని లబ్ధిదారులకు అందించారు. ట్రైకార్ ద్వారా ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, రెబ్బెన రైతు ఉత్పత్తి సంఘాలకు మొదటి దశ రాయితీగా ఒక్కో రైతు ఉత్పత్తి సంఘానికి రూ.7.50 లక్షలు చొప్పున మొత్తం రూ.15లక్షలు విడుదల అయ్యాయనీ వాటికీ సంబంధించిన రాయితీ చెక్కులను అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్ కుమార్, సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుజాత, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు వినోద్, ప్రశాంత్, ప్రజ్ఞా శీల్, బోర్డు డైరెక్టర్‌లు పాల్గొన్నారు.



చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

యువత చదువుతో పాటు ఆటల్లో సైతం తమ సత్తా చాటాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని ఏమాయికుంటలో లీగల్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. గ్రామీణ స్థాయి క్రీడల నుంచి జిల్లా జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచాలని ఆకాంక్షించారు. ఈ క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.51వేలు, రెండో బహుమతి రూ.25వేలు, మూడో బహుమతి రూ.10వేలుగా ప్రకటించనున్నట్టు తెలిపారు. యువతతో క్రికెట్ ఆడి సరదాగా గడిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాదవ్ జమున నాయక్, లఖన్ పాల్గొన్నారు.

22న ఆదిలాబాద్‌కు మందకృష్ణ రాక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ ఈనెల 22న జిల్లాకు రానున్నట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ తెలిపారు. పట్టణంలోని ఎస్టీయూ భవనంలో నిర్వహించే ఈ సన్నాహక సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 30 ఏండ్ల పోరాటానికి, సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పును అమలు చేసుకోవడం కోసం, ఎస్సీ వర్గీకరణను ఇంకా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక ద్రోహులకు బుద్ధి చెప్పడం కోసం, ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన వేల గొంతులు, లక్ష డప్పుల భారీ ప్రదర్శన జయప్రదం చేయడం కోసం జిల్లాల వారీగా పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు రాబోతున్నారన్నారు. ఈ సభను జయప్రదం చేయడం కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు, మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలందరూ, అలాగే ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నటువంటి వర్గీకరణ అనుకూలవాదులు ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఈ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు గైక్వాడ్ సూర్యకాంత్, సీనియర్ నాయకులు సందూరి, వినయ్, సాగర్, పట్టణ నాయకులు రాజేష్, పెద్దింటి సూర్యప్రసాద్, మురళి, రూరల్ మండలం ఇన్‌చార్జి తరుడి శంకర్, దీపక్, జైసింగ్ జివారీ పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో ముందుకు

నవతెలంగాణ-నిర్మల్

నూతన సాంకేతికతతో ముందుకు వెళ్తున్నామని జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీజీపీ తెలంగాణ ద్వారా ఆమోదించబడిన ఈ సాక్ష్య యాప్‌ను ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సాక్ష్య మొబైల్ యాప్ కొరకు ప్రతి పోలీస్ స్టేషన్‌కి రెండు మొబైల్ ఫోన్‌లతో పాటు అదనంగా 128 జీబీ మైక్రో ఎస్డీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ మొబైల్ ఫోన్‌లోని ఈ సాక్ష్య యాప్ ద్వారా నేరానికి సంబంధించిన సాక్ష్యాలు చెదిరిపోకుండా సాక్ష్యాలను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రికార్డు చేయుట, ఆ రికార్డులను ఈ సాక్ష్య యాప్‌తో కోర్టులో ప్రవేశ పెట్టడం, నేరస్తులకు త్వరితగతిన శిక్షలు విధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో పురాతన బిల్డింగ్‌లో విధులు నిర్వహిస్తు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాగా శనివారం నూతన తహసీల్దార్ కార్యాలయం భవనం నిర్మించేందుకు స్థలాన్ని ఆర్ అండ్ బి ఈఈ సునీల్ బాబు, బీజేపీ మండల నాయకులు కలిసి తహసీల్దార్ భవన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు ఏశాల దత్తాత్రి మాట్లాడారు. ఎన్నో ఏండ్ల నుంచి మండల కేంద్రంలో తహసీల్దార్ భవనం లేకపోవడంతో మండల ప్రజలు, అధికారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే చొరవ చూపి నూతన భవనం మంజూరుకు కృషి చేస్తున్నామని అన్నారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో తహసీల్దార్ అశోక్, సాయినాథ్, రమేష్, గంగాశేఖర్, మండల ప్రజలు ఉన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని దర్బాతండాలో రూ.12లక్షలతో నిర్మించే నూతనంగా అంగన్‌వాడి భవన నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామంలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్టు తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్దే ధ్యేయంగా గ్రామ పర్యటనలు, సమస్యల పరిష్కారానికి కృషికి ప్రత్యేకంగా గ్రామ పర్యటనలు చేస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. ఇదే మండల వాసిగా ఎలాంటి ఇబ్బందులు ఉన్న అన్నగా భావించి సమస్యలు తెలుపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మక తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | జనవరి 19, 2025 | www.navatelangana.com

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డులు, రైతు భరోసా సర్వేను అధికారులు పగడ్బందీగా చేపట్టాలని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. శనివారం మండలంలోని బొంబాయి గూడా గ్రామంలో అధికారులు చేస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటికెళ్లి సర్వేను నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపట్లకు తావివ్వకుండా పకడ్బందీగా సర్వే కొనసాగాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఆల్బర్ట్, వ్యవసాయ అధికారి మనిషా, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని లంబాడిగూడ, సలుగుపల్లి, రెబ్బెన గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 40 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకోని ఏడు కేసులు నమోదు చేసి 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అనంతరం నాటుసారా, గంజాయి వల్ల కలిగె దష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా 14 మంది నేరస్తులని తహసీల్దార్ భూమేశ్వర్ ఎదుట బైండోవర్ చేసినట్టు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వీ.రవి తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు పి.లోభానంద్, ఐ.సురేష్, ఎస్ఐ కె.ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందాపూర్ వాగులో పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని ఇందాపూర్ సమీపంలోని పెద్దవాగులో వ్యక్తి గల్లంతైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై గుపుల విజయ్ సంఘటన వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని దేవాపూర్ దేవాడ గ్రామానికి చెందిన కోట్నాక మారు (30) ఈనెల16న పోతురాజు జాతరకని చెప్పి ఇంటి నుండి బయలు దేరాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో మృతుడి తండ్రి దౌలత్ రావు పోతురాజు జాతరలో ప్రక్క గ్రామాల్లో బంధువుల ఇండ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. జాతర చూసి తిరుగు ప్రయాణంలో వాగు దాటేందుకు పడవ వద్దకు వచ్చి వేచి చూసినట్టు తెలిపారు. సమయం పడుతుందని సదరు పడవ నడుపు వ్యక్తి చెప్పగా తనకు ఈత వచ్చని, వాగు ఈదుకుంటూ వెళ్తానని చెప్పినట్లు పడవ నడుపే వ్యక్తి చెప్పినట్లు మృతుడి తండ్రి పేర్కొన్నాడు. ఫిర్యాదు మేరకు వాగు వద్ద శనివారం గాలింపు చర్యలు చేపట్టాగా మృతదేహం లభ్యమైంది. సంఘటన స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెజ్జూర్ నుండి చేప్రాలకు మహా పాదయాత్ర ప్రారంభం



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఎలుకపెల్లి-బి అభయాంజనేయ స్వామి ఆలయం నుండి చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రానికి పాదయాత్రగా శనివారం హనుమాన్ భక్తులు బయల్దేరారు. మహా పాదయాత్రను బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్ కుమార్, కంకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సులువ కనకయ్య, శ్రీ రంగనాయక స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగిడిపల్లి మహేష్ హనుమాన్ జండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర బెజ్జూర్ మండలం నుండి బెజ్జూరు, కుకూడా, భారగుడా, ముంజంపల్లి, చింతలమానపల్లి మండలంలోని రుద్రాపూర్, బాలాజీ అనుకోడ, బాబా పూర్ మీదుగా మహారాష్ట్రలోని చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రానికి చేరుకుంటుంది. 20 సంవత్సరాలుగా ఈ మహా పాదయాత్ర కొనసాగుతుంది. బెజ్జూర్ శ్రీ రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలో సామల వెంకటేశం తేనెటి విందు ఏర్పాటు చేశారు, సబ్‌స్టేషన్ సమీపంలో ప్రధాన చౌరస్తాలో తాజా మాజీ ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా జావిద్ పాదయాత్ర భక్తులకు వాటర్ బాటిల్, బిస్కెట్ ప్యాకెట్ పంపిణీ చేశారు. నాగుల్వాయి భక్తులు పాదయాత్ర భక్తుల కోసం అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎలుకపల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ, సిర్పూర్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్, పాదయాత్ర నిర్వాహకులు కొండవీటి భాస్కర్ రాజ్, పుల్లూర్ సతీష్, భక్తులు సామల తిరుపతి, శ్రీరామ్మోహన్, మహేందర్, శ్రీకాంత్, సంతోష్, గూడ రాకేష్, నికాడి బాబురావు, లింగం పద్మాకర్, తిరుపతి పాదయాత్ర భక్తులు పాల్గొన్నారు.

కౌటాల : బెజ్జూర్ గ్రామపంచాయితీ పరిధిలోని ఎలుకపల్లి అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి మహారాష్ట్రలోని చెప్రాలకు బయలుదేరిన భక్తులకు తుమ్మిడిహేట్టి పుష్కర ఘాట్ కార్తీక్ స్వామి ఆలయం వద్ద శ్రీ శివసిద్ధి హనుమాన్ మందిర్ తాటిపల్లి కుర్త ఆలయ కమిటీ అధ్యక్షులు ఎల్ములే దత్తు పటేల్ అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వాగడే గంగారాం, గొల్ల రమేష్, మడావి విష్ణు, సాత్పుతే ఆకాష్, ఆలయ కమిటీ సభ్యులు ధనోర్కార్ మధుకర్ పటేల్, హుల్కె భాస్కర్ పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన మాలీ సంఘం నాయకులకు ఘన సన్మానం



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనంలో నూతనంగా గెలుపొందిన మాలీ సంఘం నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు లెండుగురే శ్యామ్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్ రావ్, జిల్లా అధ్యక్షులు సండే వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి నికోడే గంగారంలను సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు లెండుగురే శ్యాంరావ్ మాట్లాడుతూ మాలీ సంఘం రాష్ట్ర ఎన్నికల్లో తనను గెలిపించి ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగించిన ఈ ప్రజలకు నేనెప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. మాలీ కులస్తుల మొదటి లక్ష్యం ఎస్టీ హోదా కోసం అహర్నిశలు కష్టపడుతానని అన్నారు. మాలీ కులస్తుల కోసం ఎప్పుడు అందుబాటులో ఉంటూ హక్కుల కోసం ఉద్యమిస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్ మాట్లాడుతూ మాలీ కులస్తులంతా ఐక్యంగా ఎస్టీ హోదా కోసం ఉద్యమించాలన్నారు. వెనుకబడిన మాలీకులస్తుల స్థితిగతులను తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త జీఓను ఏర్పాటు చేసి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వశాఖ నిహారిక జ్యోతి రావు, ఆదె శ్రీనివాస్, మోర్లె రమేష్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి లబ్దిదారుడికి సంక్షేమ ఫలాలు అందాలి

- అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి



నవతెలంగాణ-కెరమెరి

జిల్లాలో అర్హత గల ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్లు సూపర్ చెక్ అందజేశారు. ఎస్‌బిఎం టాయిలెట్ కాంప్లెక్స్‌కు భూమి పూజ చేశారు. సాకడ గ్రామంలో రైతు భరోసా, రేషన్ కార్డుల క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాల నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత దరఖాస్తుదారుల వివరాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌బిఎం టాయిలెట్ కాంప్లెక్స్ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు భరోసా, రేషన్ కార్డులపై సమగ్ర విచారణ జరిపి ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా జాబితా రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు ద్వారా జిల్లాలోని అర్హులైన ప్రతి లబ్దిదారుడికి పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుదారులలో అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి జాబితాను రూపొందించాలని తెలిపారు. రైతు భరోసా పథకానికి అర్హులైన వారి జాబితా తయారు చేయాలని, వ్యవసాయ అధికారులు రూపొందించిన జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పథకాల వారీగా అధికారులను నియమించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గోయగాం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యత, వంటశాల, రిజిస్టర్‌లను పరిశీలించారు.

ఉపాధ్యాయునిగా మారిన వేళ

ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఎంచుకున్న లక్ష్య సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తూ తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థులను పాఠ్యాంశాలు గురించి అడిగిగారు. పఠన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఎంపీడీఓ అంజత్ పాషా, మాజీ ఎంపిపి పెందూర్ మోతీరాం, వ్యవసాయ విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి • పార్టీలో భారీగా చేరికలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న రోజుల్లో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధీమావ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లింగాపూర్ మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయిందని ఆరోపించారు. ప్రజలు మొదటి సంవత్సరంలోనే ప్రభుత్వంతో విసిగిపోయారని దీంతోనే తమ పార్టీలోకి రోజురోజుకు వలసలు పెరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో అధికారంలోకి రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని ఇందాపూర్ సమీపంలో పోతురాజు ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం, పోతురాజు ఆలయనిర్వహణ కమిటీ అధ్యక్షులు సిడాం ధర్ము, ఆలయ కమిటీ చైర్మన్ సిడాం రాజులతో కలిసి మానిక్‌గూడ జట్టుకు మొదటి బహుమతి ఎమ్మెల్యే కోవ లక్ష్మీ తరపున రూ.7777, ద్వితీయ బహుమతి కోలాం కోఠారీ జట్టుకు రూ.5555 నగదును మాజీ వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం తరుపున వారి తనయుడు అందించారు. మూడవ బహుమతి కెరమెరి జట్టుకు రూ.3333 ఆలయ కమిటీ నిర్వహకులు అందించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు కుడ్మేత సోము, మాడవి భరత్ భూషణ్, ఆత్రం చందన్‌షావ్, రాము, భీము పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-కాగజ్‌నగర్



జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కుమురంభీం జిల్లాలో 6, మంచిర్యాలలో 7, నిర్మల్లో 6, ఆదిలాబాద్‌లో 5 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కుమురంభీం జిల్లాలో 1159 మంది విద్యార్థులకు గానూ 805 మంది విద్యార్థులు హాజరు కాగా 354 మంది గైర్హాజరయ్యారు. మంచిర్యాల జిల్లాలో 1383 మంది విద్యార్థులకు గానూ 1090 మంది విద్యార్థులు హాజరుకాగా 293 మంది గైర్హాజరయ్యారు. నిర్మల్ జిల్లాలో 1479 మంది విద్యార్థులకు గానూ 1310 హాజరుకాగా 169 మంది గైర్హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో 1170 మంది విద్యార్థులకుగానూ 962 మంది హాజరు కాగా 208 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి సూపర్‌వైజర్, పరిశీలకులను నియమించారు. కాగా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా ఏర్పాట్లు చేశారు. కాగజ్‌నగర్‌లోని పరీక్ష కేంద్రాలను ప్రిన్సిపాల్ కొడాలి పార్వతి పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

హెచ్‌ఎంపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై డిసెంబర్ 23న కొందరు వ్యక్తులు పాఠశాలలోకి చొరబడి విచక్షణ రహితంగా మూకదాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై జనవరి 12న తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాలు పాల్గొని దాడులకు పాల్పడ్డ వారి పైన చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా జనవరి 20న పాఠశాలలకు నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరుకావాలని పిలుపిచ్చినట్లు టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు హరీష్ ఒక ప్రకటన పేర్కొన్నారు. వివిధ సందర్భాల్లో పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను ఖండించాలని, రాష్ట్రంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకుల పిలుపుమేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అండర్ ట్రయల్ కేసులు సమన్వయంతో పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఉన్న అండర్ ట్రయల్ కేసులను సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా జడ్జి ఎంవీ.రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టులోని తన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్డీఓ లోకేశ్వరరావు, సబ్ జైలర్ ప్రేమ్ కుమార్‌తో కలిసి అండర్ ట్రైల్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ అండర్ ట్రయల్ కేసులకు సంబంధించి కక్షిదారుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. చార్జి షీట్ వేసిన వేయని కేసులకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. బెయిల్ మంజూరైన వెంటనే నిర్ణీత నిబంధనలు పాటిస్తూ వారిని విడుదల చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు అండర్ ట్రయల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో డిఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్ద పీట వేసిన మహనీయుడు ఎన్టీఆర్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలుగు ప్రజలకు ఎనలేని సేవలు అందించి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి అభివృద్ధికి పెద్ద పీఠ వేసిన మహనీయుడు దివంగత ఎన్టీఆర్ అని టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గుల్లపల్లి ఆనంద్ అన్నారు. నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకోని ఎన్టీఆర్ చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించి పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడిన మహానాయకుడని కొనియాడారు. పట్వారి వ్యవస్థ రద్దుచేయడం, మహిళలకు సమాన హక్కును కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్.మధుకర్, చల్లూరి శంకర్, వై.శ్రీనివాస్, సురేందర్, సమ్మగౌడ్, తాహేర్, సత్యం, శ్రీను పాల్గొన్నారు.

తలోడి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

నవతెలంగాణ-కౌటాల



తలోడి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ గావుడె హనుమంతు శనివారం ప్రార్థన సమయాని కంటే ముందే చేరుకొని ప్రార్థన సమయంలో జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. అదేవిధంగా ప్రార్థన అనంతరం తరగతి గది బోధనను పరిశీలించి విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించి వర్క్ బుక్స్ పూర్తి చేశారా లేదో చూశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం అమలు తీరుపై హెచ్‌ఎంతో మాట్లాడి



మెనూ పాటించాలని సూచించారు. ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టులలో అవగాహన చేసుకునే విధంగా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు గుర్తించి ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఒకరు పీఎస్‌హెచ్ ఇద్దరు టీచర్లు విద్యను అందిస్తున్నారు, అందులో సముద్రబాయి అనే మహిళా ఉపాధ్యాయురాలు వికలాంగురాలు కానీ అంగవైకల్యం పక్కనపెట్టి విద్యార్థులకు ఉత్సాహంగా నేర్పించడాన్ని చూసి అభినందించారు. విద్యార్థులకు అపార్ ఐడి క్రియేట్ చేయాలని, విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయాలని ఎఫ్ఎల్ఎన్ ప్రకారం విద్యా బోధన చేయాలని, సిలబస్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మానవత్వం చాటుకున్న రెవెన్యూ ఉద్యోగులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

పురుగులమందు తాగి అపస్మరక స్థితిలో ఉన్న వ్యక్తిని ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటారు రెవెన్యూ ఉద్యోగులు. వివరాలు ఇలా ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ షేక్ ఖాదర్ హుస్సైన్, అటెండర్ మల్లేష్ ఇటిక్యాల పహాడ్ గ్రామంలో రేషన్ కార్డుల సర్వే నిర్వహించి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో సిర్పూర్ గ్రామం దుబ్బగూడకు చెందిన సెందే సంతోష్ అనే వ్యక్తి చేనులో పురుగులమందు తాగి చుట్టుపక్క వాళ్ల సాయం చేయమని అరవడంతో అటువైపు నుండి వస్తున్న వీరు తక్షణమే స్పందించారు. తమ మోటార్ సైకిల్‌పై సిర్పూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | జనవరి 19, 2025 | www.navatelangana.com

నవోదయ పరీక్ష కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని నవోదయ పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, సెక్టోరల్ అధికారి సత్యనారాయణ మూర్తి సందర్శించారు. బడి బయట పిల్లల సర్వేలో భాగంగా లక్షెటిపేట గోదావరి రోడ్ వీకర్ సెక్షన్‌లో సందర్శించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విద్యా ప్రయోజనాలను వివరిస్తూ విద్యార్థులందరూ రెగ్యులర్గా పాఠశాలలకు హాజరుకావాలని సూచించారు. మండల విద్యా వనరుల కేంద్రం సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం నవోదయ పరీక్ష కేంద్రాలను సందర్శించడం జరిగినది. జిల్లా పరిషత్ బాలికల పాఠశాల 196కి 143, ట్రినిటీ స్కూల్ 192కి 136 మొత్తం 388 విద్యార్థులకు గాను 279 విద్యార్థులు నవోదయ పరీక్షకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హెలెన్ డోరతి, సీఆర్‌పీ రవి పాల్గొన్నారు.

కాకా స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి



గడ్డం వెంకట స్వామి స్మారక క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా శనివారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌కి ముఖ్య అతిథిగా మందమర్రి పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు బీసీ యువజన జిల్లా ఉపాధ్యక్షుడు రాయబారపు కిరణ్ హాజరయ్యారు. సారంగపల్లి, ముదిగుంట మ్యాచ్‌కి కిరణ్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కాకా వెంకటస్వామి స్మారకంగా మొదలుపెట్టిన టోర్నమెంట్ గత నాలుగు రోజులుగా విజయవంతంగా జరగడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ ఆటల మీద చాలా ఆసక్తి చూపుతారని తెలిపారు. రేవంత్‌రెడ్డి పాలనలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడల పట్ల యువతని ప్రోత్సహిస్తుందని తెలిపారు.

కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమి స్వాధీనం

నవతెలంగాణ-తాండూర్



కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. శనివారం అచలాపూర్ శివారులోని శివారులోని సర్వే నెం. 972 లోని 13 ఎకరాల విస్తీర్ణం గల కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసు రక్షణ మధ్య రెవెన్యూ అటవీ శాఖ ఆర్ అండ్ బి అధికారులు సంయుక్తంగా కొలతలు నిర్వహించి ప్రభుత్వ భూమి హద్దులు గుర్తించారు. ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ కలెక్టర్ మంచిర్యాల లేఖ నంబర్ డీ4-ఏ 436/2020. ద్వారా 2021 సంవత్సరంలో భూమిని అటవీ శాఖకు అప్పగించడం జరిగిందని తెలిపారు. అట్టి భూమిని ముగ్గురు వ్యక్తులు కబ్జా చేసి మామిడి తోట నాటారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడితే శాఖ పైరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో ప్రభుత్వ భూములకు నిర్దిష్టమైన కొలతలు ఉన్నాయని అత్యాశకు పోయి ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే నష్టపోతారని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు రెవెన్యూ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎజాజోద్దీన్ ఎస్ఐ కిరణ్ కుమార్ అటవీ శాఖ ఆర్ అండ్ బి సర్వే అధికారులు పాల్గొన్నారు

మున్సిపల్ ఎన్నికకు రాజకీయ జేఏసీ ఏర్పాటు

నవతెలంగాణ-మందమర్రి



మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహించాలనే లక్ష్యంతో మందమర్రి రాజకీయ జేఏసీ ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వినర్‌గా అందుగుల శ్రీనివస్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎన్నికల సాధనే ధ్యేయంగా బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, జనసేన, బీఎస్పీ, ఇతర పార్టీలతో కలిసి పొలిటికల్ జేఏసీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఐక్యంగా పోరాటం చేసి మున్సిపాలిటీ ఎన్నికలు జరిపిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలన్నీ ఏకమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తేనే ఎన్నికలు జరుగుతాయనే ఉద్దేశంతోనే జేఏసీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన ఊరు మందమర్రి గ్రామాన్ని గ్రామపంచాయతీగా చేసి ఆ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పట్టణానికి ఏజెన్సీ ప్రాంతం ఊరు మందమర్రికి న్యాయం జరగాలంటే 1950 చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంగా కేటాయించిన హద్దులను గుర్తించి గ్రామపంచాయతీగా ప్రకటించి మిగతా పట్టణ ప్రాంతానికి ఎన్నికలు జరిగే విధంగా కృషి చేస్తేనే అభివృద్ధి జరుగుతుందని సూచించారు. స్వరాష్ట్రం కోసం ఎంత పోరాటం చేసామో మందమర్రి మున్సిపల్ ఎన్నికలు జరిగే వరకు కూడా పొలిటికల్ జేఏసీగా పోరాటం చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కూడా మున్సిపాలిటీ ఎలక్షన్ జరిగే విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని కోరారు. మున్సిపల్ ఎలక్షన్ జరపాలని తేది 20న మున్సిపాలిటీ కమిషనర్‌కి, అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కోకన్వీనర్లుగా మెడిపల్లి సంపత్, బండారు సూరిబాబు, సప్పిడి నరేష్, రంగు శ్రీనివాస్, కొంగల తిరుపతిరెడ్డి, ఎండీ అబ్బాస్, ముల్కల రాజేంద్రప్రసాద్, మాయ రమేష్, ఆశాది సురేష్, రాయబారపు వెంకన్న, రసూల్‌ను ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తాం

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తామని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ నాయక్ అన్నారు. గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం, గిరిజన ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణిలో గత కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నటువంటి 665 పోస్టులు డీడీఎఫ్ పోస్టులు 350ల విషయమై ప్రభుత్వంతో పాటు గత సింగరేణి సీఎండీ శ్రీధర్‌తో చర్చించి భర్తీ చేయడం జరిగిందని అన్నారు. రాబోవు రోజుల్లో కూడా గిరిజన ఉద్యోగులకు పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి గిరిజనులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా న్యాయ పరంగా వారి హక్కులు వారికి అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, సంస్థ నిర్దేశిత లక్ష్య సాధనలో ప్రతి ఉద్యోగి రక్షణతో కూడిన కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పంతులా నాయక్, డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ ఈఅండ్ఎండీ సత్యనారాయణ, జీఎం సుభాని, ఎల్ హథీరాం, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని చందారం, తిమ్మాపూర్ గ్రామ పంచాయతీలను శనివారం జిల్లా పంచాయితీ అధికారి డి వెంకటేశ్వర్ రావు ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని, గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేసి వసూలైన ఎప్పటికప్పుడు చలానా ద్వారా గ్రామ పంచాయతీ సాధారణ నిధికి జమ చేయాలని, ఈ నెల చివరకు వరకు 100 శాతం పూర్తి చేయాలని పంచాయితి కార్యదర్శులకు ఆదేశించారు. వాటర్ అండ్ శానిటేషన్‌కు సంభందించిన 7 రిజిష్టర్లను పరిశీలించారు. సెగ్రిగే షన్ షెడ్‌ను సందర్శించి కంపోస్టు ఎరువు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పంచాయతి అధికారి బి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు శ్రీలత, దుర్గాదేవి పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-జన్నారం

సీపీఐ(ఎం) నాల్గవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కనికరపు అశోక్ అన్నారు. మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని రామాలయం కాలనీలో శనివారం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరుగుతున్నాయని తెలిపారు. సీపీఐ(ఎం) ప్రజల పక్షాన నికరంగా నిలబడే పార్టీ అని, కష్టజీవుల పార్టీ అని అన్నారు. బూర్జువ పార్టీలు ప్రజల్ని ఇక్కట్ల పాలు చేస్తూ అసమాన తలను పెంచుతుందని, పెట్రోల్ డీజిల్, గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి బతకలేని దుర్భర స్థితిలోకి ప్రజలను నెట్టివేస్తున్నదని, తెలిపారు. కొండగుర్ల లింగన్న జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి దశాబ్ద కాలం గడిచిన, ప్రజల సమస్యలు మాత్రం తీరడం లేదని, యువత నిరుద్యోగంలో కూలీలు కార్మికుల బ్రతుకులు దయానియంగా ఉన్నాయని అన్నారు. దేశ, రాష్ట్ర, ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలను చర్చించి రాబోయే కాలంలో నిర్వహించబోయే ఉద్యమాలు పోరాటాలకు ప్రణాళిక రూపొందించుకోవడానికి రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నది. రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచిగా నిల్వనున్నాయి. మహాసభలను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూకటి కారు బుచ్చయ్య, అంబటి లక్ష్మన్న, దాసండ్ల రాజన్న, ఎస్‌కే అబ్దుల్లా, పర్ల కనకయ్య, ఒడిపల్లి చంద్రయ్య, ఓదెలు పాల్గొన్నారు.

'సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి'

నవతెలంగాణ-జన్నారం



ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ప్రతి గ్రామంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జన్నారం ఎస్ఐ గుండేటి రాజ వర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని తపాలాపూర్ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలన్నారు. దొంగతనాలు జరగకుండా నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. మాజీ సర్పంచ్ నైనాల తిరుపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ విజయ్ గ్రామస్థులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికకు చేపట్టిన సర్వేను మండల ప్రత్యేక అధికారి సాంబశివరావు పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, తప్పులు లేకుండా సర్వే చేయాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కార్యకర్త చిన్న పిల్లలకు టీకాలు వేస్తున్న తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శేఖ్ సఫ్దర్ అలీ, సర్వేటీం సీనియర్ అసిసెంటంట్ ఆకుల లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి రజిత, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-తాండూర్



మాదారం పంచాయతీ సెక్రెటరీ సౌందర్య తన కుమారుడు సాయి వేదాంత్ పుట్టినరోజు వేడుకలను మాదారం ప్రభుత్వ పాఠశాలలో పిల్లల మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివవే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని, ఐకమత్యాన్ని పెంపొందించేందుకు పిల్లల మధ్య జన్మదిన వేడుకలు జరిపినట్లు తెలిపారు. పిల్లలకు పండ్లు స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి ఎక్సైజ్ ఉద్యోగి ప్రశాంత్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి విద్యుత్ థర్మల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పట్ల సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం ప్లాంట్ ప్రధాన ద్వారం ఎదుట హెచ్ఎంఎస్ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ముందస్తు సమాచారంతో టోకెన్ సమ్మె చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎన్టీపీసీలో చెల్లిస్తున్నట్లుగా రూ.5 వేల డస్ట్ అలవెన్స్ చెల్లించడంతో పాటు భూనిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు, ఈఎస్ఐ ఆసుపత్రి సౌకర్యం కలిపంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దత్తత తీసుకున్న పెగడపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఎస్టీపీపీ నాయకులు విక్రం, సాయికృష్ణారెడ్డి, వంటకాల అనిల్‌రెడ్డి, రిక్కుల నర్సింహరెడ్డి, సంపత్, నోముల బాలయ్య, కళాబృందం నాయకులు రమేష్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోదాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గుడుంబా మీద స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని దండేపల్లి, లింగాపూర్ గ్రామాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రెండు లీటర్ల గుడుంబా, 95 కిలోల బెల్లం, 10 కిలోల పట్టిక జప్తు చేసుకొని బోడ పంచిబాయి, గోలి రమేష్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మౌనిక, సిబ్బంది ఈష్పత్తి రావు, శ్రీనివాసరెడ్డి, తిరుపతి యాదవ్, వెంకటేష్, శిరీష పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ప్రచార కార్యదర్శిగా బన్న లక్ష్మణ్‌దాస్

నవతెలంగాణ-కాసిపేట



ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శిగా మందమర్రి ఏరియా కాసిపేట 1వ గని క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న బన్న లక్ష్మణ్ దాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రచార కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ కార్మికుల శ్రేయస్సు, యూనియన్ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని లక్ష్మణ్ దాస్ పేర్కొన్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం

నవతెలంగాణ-మంచిర్యాల



ఏకగ్రీవంగా రెండవ సారి ఎన్నికైన టీఎన్జీఓ హౌజింగ్ సొసైటీ సభ్యులను శనివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్ర లోని టీఎన్జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సభ్యులందరు ఐక్యంగా ఉండి హౌజింగ్ సొసైటీలో ఉన్న గృహ నిర్మాణాలను తొందరగా పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహ్మద్ హబీబ్, మొండయ్యా, భూముల రామ్మోహన్, శ్రీపతి బాపు పలువురు పాల్గొన్నారు.

మార్కెట్ ఏరియాలో ఆక్రమణల తొలగింపు

నవతెలంగాణ-మందమర్రి

మున్సిపాలిటీలోని మార్కెట్ ప్రాంతంలో ఆక్రమణలను శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటేష్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం వెలసిన దుకాణాలపై వచ్చిన ఫిర్యాదులతో చర్యలకు ఉపక్రమించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తొలగింపు కార్యక్రమం లో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు టీడీపీ శ్రేణుల ఘన నివాళ్లు



మందమర్రిలో..

నవతెలంగాణ-మందమర్రి

నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా శనివారం సింగరేణి పాఠశాల ఎదుట విగ్రహానికి పార్టీ శ్రేణులు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మానసిక వికలాంగ పిల్లలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో అత్యున్నతమైన నాయకుడు ఎన్టీఆర్ అని పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు ఆర్ జయ, అపర్ణ జ్యోతి, నరసయ్య, పారుపల్లి శీను, సత్యనారాయణ, చాట్లపల్లి రాజేష్, కనకన్న, నరసమ్మ లావణ్య పాల్గొన్నారు.



నస్పూర్‌లో..

లక్షెట్టిపేట : ప్రతి తెలుగు వాడి ఆత్మగౌరవం ఎన్టీఆర్ అని మున్సిపల్ ఫ్లోర్ లీడర్స్ చెల్ల నాగభూషణం పేర్కొన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ చెల్ల నాగభూషణం, సీనియర్ నాయకులు నడిమెట్ల రాజన్న, కాసు సురేష్ పాల్గొన్నారు.

నస్పూర్ : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులైన నందమూరి తారక రామారావు తెలుగు ప్రజలకు స్ఫూర్తి ప్రదాత అని పెద్ద పెల్లి పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి తలారి రాజు అన్నారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియాలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదుట, బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గరిగంటి రాజయ్య, మాజీ తెలుగు యువత నాయకులు ఆవుల సుధాకర్, నాయకులు పెంటయ్య,మల్లయ్య, శ్రీనివాస్, బూరుగు సత్యనారాయణ, మిడిదొడ్డి మొండయ్య, వడ్లకొండ వెంకన్న, పోగుల కిష్టయ్య, మస్తాన్, వేమూర్ల కృష్ణ, నర్సొజీ పాల్గొన్నారు.

తాండూర్ : బెల్లంపల్లి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ అనుబంధ కార్మిక సంఘం టీఎన్టీయూసీ కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ మాజీ అధ్యక్షుడు మణి రామ్ సింగ్, మాజీ అధ్యక్షుడు ఎస్సీ ఎల్‌యు ప్రధాన కార్యదర్శి బొల్లు మల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు సిహెచ్ రమేష్, గంగాధర్‌గౌడ్, తుంగల రాములు, ఎండీ సుభాన్, పి పోచమల్లు గంట కనకయ్య, మోసాడి గోపాల్, బి సత్యనారాయణ పాల్గొన్నారు.



తాండూర్‌లో..

బడి బయట పిల్లలపై సర్వే

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ధర్మారావుపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని నాయకపుగూడ, వరిపేట, బుగ్గగూడెం గ్రామాల్లో సీఆర్పీ మడావి తిరుపతి ఆధ్వర్యంలో బడి బయట పిల్లలను గుర్తింపుపై సర్వే చేశారు. ఈ సర్వేలో 6 నుంచి 14 పాఠశాల స్థాయిలో, 15 నుంచి 19 కళాశాల వయస్సు గల పిల్లలపై సర్వే చేశారు. 15 నుంచి 19 మధ్య ఉన్న ఒకరిని గుర్తించినట్లు సీఆర్పీ తిరుపతి తెలిపారు.

తరగతి గదుల కొరత తీర్చండి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సికిందర్

నవతెలంగాణ-జైపూర్



ఆరుబయట విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు తరగతి గదుల కొరత తీర్చాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సికిందర్ డిమాండ్ చేశారు. పౌనూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గదుల కొరత ఉందని శనివారం మండల విద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. పౌనూర్ గ్రామానికి చెందిన వారితో పాటు శివ్వారం, వేలాల గ్రామాలకు చెందిన 6వ తరగతి విద్యార్థులు ఆరుబయట విద్యాబ్యాసం చేస్తూ పాముల బెడద ఎదుర్కొవల్సి వస్తోందని ఆవేధన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఇబ్బందుల పట్ల అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రి రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యుడు ఈవీ శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ మేకల అక్షయ్ కుమార్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్డు ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఎంతో మందికి రక్తాన్ని అందించామన్నారు. కార్యక్రమంలో మండల మాల మహానాడు సెక్రెటరీ కోడి హరీష్, ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ లక్ష్మీ, సిబ్బంది క్రిష్ణవేణి, విజయలక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పైడిపల్లి హనుమాన్ టెంపుల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరి వద్ద 30 గ్రాముల గంజాయి లభించిందని ఎస్సై గుండేటి రాజావర్ధన్ తెలిపారు. శనివారం సమాచారం మేరకు పైడిపల్లి హనుమాన్ టెంపుల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కామెర నగేష్, బెంబడి పవన్ వద్ద 30 గ్రాముల గంజాయి లభించిందన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మండలంలో గంజాయి సేవించిన, విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి సమాచారం ప్రజల వద్ద ఉంటే తమకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

మెస్రం వంశీయులకు అల్పాహారం అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్



నాగోబా జాతర కోసం గోదావరి జలాలను తీసుకు వెళ్తున్న మెస్రం వంశీయులకు ఉట్నూర్ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు అల్పాహారం అందించారు. శనివారం మండలంలోని కొత్త గోండుగూడ(జి) గ్రామానికి చేరుకున్న మెస్రం వంశీయులకు అల్పాహారం అందించి, భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంద్ర జైవంతరావు, సామాజిక కార్యకర్త మెస్రం కేశవ్, సత్తేన్న, మహేందర్, భూమన్న, జయచంద్ర పాల్గొన్నారు.

కుక్కల బీభత్సం..పదిమందికి గాయాలు

నవతెలంగాణ-ముధోల్


ముధోల్‌లో కుక్కలు బీభత్సం సృష్టించి పది మందిని గాయపరిచాయి. వెంటనే వారు ఆస్పత్రికి వెళ్లి చికిత్సలు పొందారు. సంజయ్, యూసుఫ్ ఖాన్, సాయిఖ్, వినోద్, ఎస్‌డీ కలీం, ఎండీ కలీం, జ్యోతి, హరిత, రూపలు కుక్కల దాడిలో గాయపడ్డారు. పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని చెబుతున్న పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెండు బైకులు ఢీ : ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డ ఘటన శుక్రవారం రాత్రి లక్ష్మణచాంద మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. వడ్యాల్ గ్రామానికి చెందిన సార్ల భీమన్న(48) బైక్‌పై నిర్మల్ వైపు వెళుతున్నారు. లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన ముత్యం(38) బైక్‌పై ఎదురుగా వస్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో నిర్మల్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

కలప అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో కలప అక్రమ నిలువ ఉంచిన రవాణా చేసిన టైగర్ జోన్ నిబంధనల మేరకు కఠిన చర్యలు తప్పవని ఇంధన్‌పల్లి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ అన్నారు. ఇంధన్‌పెల్లి రేంజ్ కార్యాలయం పరిధిలోని హాస్టల్ తండా నాయక గుడా గ్రామాలలో శనివారం ఇండ్లలో తనిఖీలు నిర్వహించారు. ఆ గ్రామాలకు చెందిన కొంతమంది అక్రమంగా కలప రవాణా చేస్తూ ఇంట్లో నిల్వ ఉంచుకుంటున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేశామన్నారు. ఎఫ్ఎస్ఓలు రవి, హనుమంతరావు ముసిపుద్దిన్, రూబీనా పాల్గొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి వచ్చే సోమవారం ఈ నెల 20న ప్రజావాణిని రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ఈ నెల 26న అమలు చేయనున్న నాలుగు పథకాలపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ వెరిఫికేషన్ చేపడుతున్న సందర్భంగా వచ్చే సోమవారం ప్రజవాణిని రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు, అర్జీదారులు దీనిని గమనించాలని కోరారు.

వసంత పంచమి పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ముధోల్

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో వసంతపంచమి వేడుకలు ఫిబ్రవరి 1 నుండి 3 వరకు వైభవంగా ప్రారంభంకానున్నాయి. హైదరాబాద్‌లో ఉత్సవ ఆహ్వాన పత్రికలు, గోడ ప్రతులను శనివారం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆ విష్కరించారు. ఉత్సవాలకు హాజరు కావాలని మంత్రిని ఆలయం ఈఓ కోరారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నవీన్ కుమార్, సహాయ కార్యనిర్వాహణాధికారి సుదర్శన్, దేవస్థాన వైదిక బృందం, వేదపండితులు పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-కుభీర్

అర్హులందరికి రేషన్‌కార్డులను మంజూరు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం తహసీల్దార్ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఏశాల దత్త్రాతి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రకటించిన రేషన్ కార్డులా జాబితాలో కేవలం 20శాతం లబ్దిదారులకు మాత్రమే ప్రకటించాడం మిగితా 80శాతం మందికి మొండి చేయి చూపడం జరిగిందని ఆరోపించారు. రేషన్ కార్డులు మంజూరు చేవ్యకపోతే బీజేపీ ఆధ్వర్యంలో తీవ్ర నిరసనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో దత్తత్రి, గంగా శేఖర్, జీవన్, వసంత్, సాయినాథ్, నాయకులు, కార్యకర్తలున్నారు.

ఆత్మీయ భరోసాతో కిటకిటలాడుతున్న కార్యాలయాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం భూమి లేని నీరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద జాబితా వెళ్లడించింది. మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు ఉండగా 3,776 మంది లబ్దిదారుల జాబితా విడుదల కావడంతో ఎంపీడీఓ కార్యాలయం కిటకిట లాడింది. ఈ పథకం కింద ఏడాదికి రూ.12వేలు ప్రభుత్వం అందించనుంది. దీంతో లబ్దిదారుల వివరాలు ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా, మొబైల్ నెంబర్, తదితర వివరాలు నమోదుచేయడంలో ఈజీఎస్ సిబ్బంది బిజీగా కనిపించారు. మొదటి జాబితాలో కేవలం 60శాతం మంది లబ్దిదారుల లిస్టు రావడంతో రాని వారు సైతం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి బారులుతీరారు. ఈజీఎస్ సిబ్బంది వారి పేర్లను ఉపాధి కార్డు నెంబరుతో చూడగా జాబితాలో లేకపోవడంతో నిరాశకు గురై వెనుతిరిగారు.

నూతన సివిల్ కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకు నూతనంగా విచ్చేసిన కానిస్టేబుళ్లకు వారానికి ఒకరోజు చొప్పున ఐదు వారాల పాటు సిబ్బందికి వివిధ అంశాలలో నిష్ణాతులైన సిబ్బందితో పోలీస్ స్టేషన్ విధులు, ప్రస్తుత పోలీస్ విధి విధానాలు అంశాలపై శిక్షణను అందించినట్టు ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. డిసెంబర్ 20న ప్రారంభమై మూడు బ్యాచులుగా విభజించి వారానికి మూడు రోజుల పాటు శిక్షణను తీసుకొని నిష్ణాతులైన నూతన 145 సివిల్ కానిస్టేబుల్ సిబ్బంది. ఈ శిక్షణలో భాగంగా సిబ్బంది కోర్టు డ్యూటీ విధులు, రిసెప్షన్ విధులు, పిటీషన్ మేనేజ్మెంట్ విధులు, బ్లూ కోర్ట్, డయల్ 100, పెట్రోలింగ్, బిట్ సిస్టం, అనుమానితులను పరిశీలించడం, నేర నియంత్రణ, నేర పరిశోధన, సీసీటీఎన్ఎస్, సైబర్ క్రైమ్, సీఈఐఆర్, ముఖ్యంగా ప్రమాదాల సమయంలో ప్రజలను కాపాడేందుకు ఉపయోగపడే సీపీఆర్ పద్ధతిపై అవగాహనను కల్పించడం జరిగిందని తెలిపారు. శనివారం పోలీస్ కార్యాలయంలో ముగింపు కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ నేర పరిశోధనలో సాక్షాదారాలు ముఖ్యమైనవి తెలిపారు. కోర్టులో నేరం నిరూపించేందుకు సాక్షదారాలను పరిరక్షిస్తూ పరిశోధన చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుదారుల పట్ల న్యాయంతో వ్యవహరిస్తూ తక్షణమే సిబ్బందిని కేటాయించి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. సమాజంలో పేదలు, వెనుకబడిన తరగతులు, ఆదిసుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ న్యాయం చేకూర్చే విధంగా చర్యలను తీసుకొని ప్రజలకు పోలీసుల పట్ల ఉన్న గౌరవాన్ని కీర్తిని పెంపొందించాలన్నారు. అదేవిధంగా పోలీసు విధులను కమ్యూనికేషన్ వ్యవస్థ కీలకమైనది వాటిని ఉపయోగించే విధానాన్ని నేర్చుకొని అమలుపరచాలని సూచించారు. పోలీసులలో ముఖ్యంగా శారీరక, మానసిక ఒత్తిడిలకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనే విధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణను అందించి తమ వంతు పాత్ర కీలకంగా పోషించిన కోర్టు విధులు న్యాయపరంగా వచ్చే సమస్యలపై వివరించిన మాజీ పీపీ రమణారెడ్డి, ఫిజికల్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ అందించిన పురుషోత్తం రెడ్డి, సుధీర్ రెడ్డిలను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ శిక్షణను పూర్తి చేయడంలో కీలకపాత్ర పోషించిన డబ్ల్యూ పీఎస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ డి.వెంకట్‌ని ఎస్పీ అభినందించారు.కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పారదర్శంగా సర్వే చేపట్టాలి : కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్ రూరల్: బట్టిసావర్గాంలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల కోసం లబ్దిదారుల ఎంపిక కోసం చేపడుతున్న సర్వేను పూర్తి పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. శనివారం మావల మండల కేంద్రంలోని బట్టిసావర్గాం గ్రామపంచాయతీలో నాలుగు పథకాల అమలుకు సంబంధించి చేస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్‌ను పరిశీలించి సలహాలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనతో పాటు ఇటీవల చేపట్టిన సామాజిక ఆర్థిక కుల గణన సర్వేలో నమోదు చేసుకున్న అంశాల ఆధారంగా వివరాలను సరి చూసుకోవాలని సిబ్బందికి సూచించారు కార్యక్రమంలో బీసీ వెల్ఫర్ అధికారి రాజలింగు, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ వైష్ణవి, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఏఓ వివేక్, మాజీ ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



తలమడుగు : సర్వే వివరాలను తీరును ప్రజలను అడుగుతున్న అదనపు కలెక్టర్ శ్యామల దేవి

తలమడుగు : మండలంలోని కోడద్ గ్రామంలో శనివారం అదనపు కలెక్టర్ శ్యామల దేవి రేషన్ కార్డు సర్వే తీరును పరిశీలించారు. రేషన్ కార్డు సర్వేలో తప్పులు జరగకుండా పగడ్బందిగా సర్వే నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలోని పలు కుటుంబాలను పలకరించి ఎంతమంది వారి ఆర్థిక పరిస్థితి, వృద్దుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనాలు అందించాలని సూచించారు. ఆమె వెంట మండల తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు కళ, లక్ష్మి గ్రామస్తులున్నారు.

పాఠశాలలను ఆరోగ్య పాఠశాలలుగా తీర్చిదిద్దాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మనిషిలో వచ్చిన మంచి మార్పు ఎప్పటికీ ఉండాలని, నెల రోజులపాటు పాటించి వదిలివేయవద్దని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ప్రతి రోజూ ప్రతి పాఠశాలలో ఉదయం ప్రార్థన సమయంలో, సాయంత్రం వేళల్లో ఆరు సూత్రాలతో పాటు యోగా నిర్వహించాలని, అన్ని పాఠశాలలు ఆరోగ్య పాఠశాలలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. శనివారం ఆరోగ్య పాఠశాలపై కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో వచ్చిన మార్పులను 44 ప్రభుత్వ పాఠశాల నుండి వచ్చిన స్టూడెంట్ చాంపియన్ విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. ఆరు సూత్రాల అమలు ప్రతి సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత, మంగళవారం పోషకాహారంపై అవగాహన, బుధవారం ఒత్తిడి నివారించుకునే మార్గాలు, గురువారం డ్రగ్స్‌కు దూరంగా ఉండడం, శుక్రవారం కాలానుగత వ్యాధుల నివారణ, శనివారం వ్యక్తిత్వ వికాసంతో పాటు మరికొన్ని ఆరోగ్య అంశాలను చేర్చి విద్యార్థులకు అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆరు సూత్రాల అమలులో విద్యార్థుల్లో చాలా మార్పులు వచ్చాయని, పొగాకు, గుట్కా తినడం మానివేశారని, జంక్ ఫుడ్ తీసుకోవడం లేదని, క్రమశిక్షణతో పాటు ఆరోగ్య అలవాట్లను పాటిస్తూ, తల్లిదండ్రుల్లో మార్పులు తీసుకువచ్చామని విద్యార్థులు తెలిపారు. ఇదే పద్ధతిలో ముందుకు వెళతామని అన్నారు. ఇప్పటి వరకు 133 పాఠశాలలను రివ్యూ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం స్టూడెంట్ చాంపియన్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ప్రణీత, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్‌లు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం డీఐఈఓ జాదవ్ పరుశురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో పలు రికార్డులను పరిశీలించి, విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి, విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడారు. కళాశాలలో చదువుకునే విద్యార్థులు ప్రతి ఒక్కరూ మంచి ఫలితాలు వచ్చేలా చూడాలని అన్నారు. ఎప్పటికప్పుడు అధ్యాపకులు చెప్పిన పాఠ్యంశాలను శ్రద్ధగా విని నోట్ చేసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలని, అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, అధ్యాపకులు సంపత్, హన్మంత్‌రావు, రమేష్, నర్సయ్య, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జవహర్ లాల్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం జిల్లాలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 1170 మంది విద్యార్థుల కోసం ఆదిలాబాద్ పట్టణంలో-3, ఉట్నూర్, ఇచ్చోడలో ఒకటి చొప్పున మొత్తం 5 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 నుంచి పరీక్ష ప్రారంభం కాగా, గంట ముందుగానే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. హాల్ టిక్కెట్‌తో పాటు ఆధార్ గుర్తింపు కార్డును పరిశీలిస్తూ, లోనికి పంపించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కేంద్రాలు సందడిగా మారాయి. మధ్యాహ్నం 1.30గంటలకు పరీక్ష పూర్తవగా, 1170 మంది విద్యార్థులకు గాను 962 మంది హాజరయ్యారు. 208 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. డీఈఓ ప్రణీత కేంద్రాలను సందర్శించి, పరీక్షను పర్యవేక్షించారు.

ఫిబ్రవరిలో మాలీ మహా సంఘ ఎన్నికలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాలీల సంక్షేమం, మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల ఆశయ సాధన కోసం దేశవ్యాప్తంగా కృషి చేస్తున్న అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీ ఎన్నికలు ఫిబ్రవరి మాసంలో నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుకుమార్ పెట్కులే, సాంబన్న సెండే పేర్కొన్నారు. శనివారం పట్టణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలో నిర్ణయించినట్లుగా ఫిబ్రవరి 2న కాకుండా ఫిబ్రవరి 9న జరపాలని రాష్ట్ర కమిటీ భావిస్తున్నామన్నారు. త్వరలోనే తేదీలను ప్రకటించి ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిటీతో సమావేశమైన రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు త్వరలోనే తేదీలను ప్రకటించి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించి మాలీల హక్కుల సాధనకు, పూలే దంపతుల ఆశయ సాధన కోసం మాలీ మహా సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విజయ్ వాడ్‌గురే, జిల్లా కార్యవర్గ సభ్యులు రామ్‌కిషన్ షిండే, అంబాదాస్, దీపక్, సంతోష్ చౌదరి పాల్గొన్నారు.

అసంపూర్తి ఇండ్లను పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో గత ప్రభుత్వ హాయంలో అసంపూర్తిగా వదిలేసిన ఇండ్లను వెంటనే పూర్తి చేయాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ పథకం కింద మొత్తం 35 ఇండ్లను మంజూరు చేయగా, కొన్ని పూర్తి కాకా ఇంకను అసంపూర్తి ఇండ్లు దర్శనం ఇస్తున్నాయి. అప్పటి గుత్తేదారులు నాసిరకం ఇండ్ల నిర్మాణాలు చేపట్టి అర్థాంతరంగా వదిలేశారు. దీంతో సబ్ కలెక్టర్ ఆ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ అన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి వేడుకలను పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం పవార్ దేవిదాస్ మాట్లాడుతూ 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీనీ స్థాపించి 9 నెలలో అధికారాన్ని కైవసం చేసుకున్న ఘనత నందమూరి తారక రామారావుదే అని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కులను ప్రజలకు అందేలా చూసిన నాయకుడు అంటే ఎన్టీ రామారావువే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపతి లింగాగౌడ్, సాడిగే రాజేశ్వర్, నారాయణ్, రాందాస్, రమేష్‌రెడ్డి, రవి, రాజారాం, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై 20 నుంచి గ్రామసభలు

నవతెలంగాణ-హాజీపూర్

జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మొదలగు పథకాల లబ్ధిదారుల ఎంపికకు ఈ నెల 20 నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్పాండే, ఎంపీడీఓ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి కృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గ్రామసభల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన పథకాల లబ్ధిదారుల పేర్లను గ్రామసభ పరిశీలించి జాబితాను తయారు చేస్తారని తెలిపారు. గ్రామ సభలకు గ్రామ ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు. ఈ గ్రామసభలను సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించబడునని, రెవెన్యూ గ్రామాలు కూడా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తారని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే రామారావు పటేల్ లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 29 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, మండలాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

